క్లుప్తంగా

ఆచార్య సుధాకరయ్యకు యూఎస్ సంస్థలో సభ్యత్వం



సుధాకరయ్యను అభినందిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పని చేస్తున్న సుధాకరయ్యను అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన ఈయూడీటీఎక్స్ఐ సంస్థ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ లాంగ్వేజెస్ సొసైటీ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు ఆయనను అభినందించారు. ఆచార్య సుధాకరయ్య ఒక సంవత్సరం పాటు ఆ సంస్థలో సభ్యులుగా కొనసాగనున్నారు.

జాతీయ నులి పురుగుల దినోత్సవంపై సమావేశం

చంద్రగిరి: ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్‌బెండాజోల్ మాత్రలు ఇచ్చి నులి పురుగులను నిర్మూలించేందుకు కృషి చేయాలని డాక్టర్ బి.కుసుమ తెలిపారు. ఆమె శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఎంఈవో–2 భాస్కర్ బాబు, వైద్యాధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

తిరుపతి కల్చరల్: రామతులసీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్‌రాజు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. సంఘం కార్యకలాపాలు, సమస్యలపై చర్చిస్తామని వెల్లడించారు. తిరుపతిలోని వివిధ వ్యాపార వర్గ సంఘం ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

బయో కార్బన్‌పై వర్క్‌షాపు

తిరుపతి సిటీ: ఎస్వీయూ జువాలజీ విభాగంలో ఆధ్వర్యంలో ''బయో ఈ3 –బయో సర్క్యులర్ ఎకానమీ''పై నిపుణులతో శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. బయో ఇంజినీరింగ్, బయో ఎకానమీ, పర్యావరణ సుస్థిరతతో కూడిన బయో ఈ3 ప్రాముఖ్యత, ప్రపంచం ఎదుర్కొనే సవాళ్లను చర్చించారు. వ్యర్థాలను తగ్గించడానికి, కార్బన్ పాదముద్రలను తగ్గించడానికి, పునరుత్పాదక జీవ వనరులను ప్రో త్సహించడానికి, బయో ఈ3 అధునాతన జీవ సాంకేతికతలతో కూడిన స్థిరమైన పద్ధతులను ఎలా అవలంబిస్తారో తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) నుంచి డాక్టర్ రమేష్ ప్రిన్సిపల్ ఆచార్య కేటీ రామకృష్ణారెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్ హాజరయ్యారు.

వరద బాధితులకు ఎస్వీయూ ఉద్యోగుల సాయం



జెండా ఊపి వాహనాన్ని విజయవాడకు పంపుతున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ : విజయవాడ వరద బాధితులకు ఎస్వీయూ బోధనేతర సిబ్బంది నిత్యావసర వస్తువులు పంపించారు. ఒక్కొక్క కుటుంబానికి 10 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, చింతపండు, పెసరపప్పు, వంటనూనె, గోధుమ పిండి, రవ్వ, పంచదార, ఉప్పు, మ్యాగీ ప్యాకెట్లు, దుప్పట్లు కిట్లుగా తయారు చేసి బస్సు ద్వారా బాధిత కుటుంబాలకు చేర్చనున్నారు. ప్రత్యేక వాహనంలో సామగ్రిని విజయవాడకు చేర్చనున్నారు. నిత్యావసర సరుకులతో వెళ్లుతున్న వాహనాన్ని శుక్రవారం వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు జెండా ఊపి విజయవాడకు పంపారు. నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మినీ 'జూ' లా రెస్టారెంట్



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి మంగళం : తిరుపతి–కరకంబాడి రోడ్డులో ఉన్న రామచంద్ర నగర్ వద్ద ఏర్పాటుచేసిన ఏ టూ జెడ్ ఎక్సోటిక్ పార్క్, రెస్టారెంట్‌ను శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. సంస్థ నిర్వాహకులు హర్షవర్ధన్ మాట్లాడుతూ ఎక్సోటిక్ పార్క్‌లో చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. విదేశాల నుంచి తెప్పించిన పక్షులు, పాములు, జంతువులు ఆకర్షణంగా నిలుస్తాయన్నారు.

ప్రైవేటు పరం చేస్తే ప్రతిఘటిస్తాం



రాష్ట్రానికి కేటాయించిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తే ప్రతిఘటిస్తాం. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కడుపుకొట్టే నిర్ణయాన్ని విరమించుకోవాలి. మెడికల్ సీట్లు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లితే ప్రతిభగల పేద విద్యార్థుల జీవితాలు ఆగమ్యగోచరంగా మారుతాయి. మెడికల్ విద్యను సామాన్యునికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. –ఆర్ ఆశ, పీడీఎస్‌వో, జిల్లా కార్యదర్శి, తిరుపతి



పేదలకు అందని ద్రాక్షలా వైద్య విద్య



మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాల నుకోవడం దారుణం. పిల్లలు డాక్టర్ కావాలని భూములు అమ్ముకుని నీట్ పరీక్షకు సిద్ధం చేస్తున్నాం. మా అమ్మాయి రెండో దఫా నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. ఈ ఏడాది ర్యాంకు సాధిస్తుందనే నమ్మకం ఉంది. మెడికల్ సీట్లు తగ్గించినా, వైద్య విద్యను ప్రైవేటు పరం చేసినా రోడ్డు పాలు అవుతాం. – కే నారాయణ, విద్యార్థిని తండ్రి, తిరుపతి

ప్రారంభించారు.. సేవలను మరిచారు

చంద్రగిరి సమీపంలోని పూతలపట్టు–నాయుడుపేట, మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారుల్లో నిరంతరం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. ఈ క్రమంలో మృతదేహాలను తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించేందుకు పోలీసులతోపాటు బాధితుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసేందుకు రెండు నెలల క్రితం భవనాన్ని ప్రారంభించారు. సేవలను మాత్రం అందించడం లేదు.

- అందుబాటులోకి రాని పోస్టుమార్టం సేవలు
- మృతదేహాలను తిరుపతికి తరలిస్తున్న వైనం
- హడావుడి తప్ప ఆచరణ లేదంటున్న ప్రజలు

అలంకార ప్రాయంగా నిలిచిన పోస్టుమార్టం భవనం



రెండు నెలలుగా తెరుచుకోలేని పోస్టుమార్టం గది



చంద్రగిరి: చంద్రగిరితోపాటు పాకాల, చిన్నగొట్టిగల్లు మండలాల పరిధిలో జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. ఎక్కడ ప్రమాదాలు జరిగినా క్షతగాత్రులు, మృతదేహాలను తిరుపతికి తీసుకురావాల్సిందే. దీంతో సరైన సమయానికి వైద్యం అందడం లేదు. దీంతో గత ప్రభుత్వం చంద్రగిరి ఏరియా ఆస్పత్రిని వంద పడకల సామర్థ్యానికి పెంచి అధునాతన సౌకర్యాలతో భవనాన్ని నిర్మించింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇదిలా ఉండగా ప్రమాదాల్లో మృతి చెందిన వారి మృతదేహాలను తిరుపతికి తరలించేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఏరియా ఆస్పత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జూలై 20వ తేదీన ఎమ్మెల్యే పులివర్తి నాని పోస్టుమార్టం గదిని ప్రారంభించారు. రెండు నెలలైనా సేవలను అందుబాటులోకి తీసుకురాలేదు. భాకరాపేట ఘాట్ లో గురువారం చోటుచేసుకున్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. చంద్రగిరి పరిధిలో ముగ్గురికి పైగా మృత్యువాత పడ్డారు. గత నెలలో భాకరాపేట కనుమలో మృతి చెందిన లారీ క్లీనర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసులు స్థానిక ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఇక్కడ సేవలు లేకపోవడంతో తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించాల్సి వచ్చింది. చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన పోస్టుమార్టం భవనంలో సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

> **సమస్యలను డీసీహెచ్ఎస్‌కు దృష్టికి తీసుకెళ్లాం**
> పోస్టుమార్టం నిర్వహించాల్సిన వైద్యుడిని జిల్లా అధికారులు ఏరియా ఆసుపత్రికి కేటాయించారు. ఈ మేరకు ప్రస్తుతం వైద్యుడు తిరుపతి మెడికల్ కళాశాలలో శిక్షణ తీసుకున్నాడు. వైద్యుడు చంద్రగిరిలో రిపోర్టు చేసుకోకుండా వేరొక చోటుకు వెళ్లిపోయాడు. దీంతో పీఎం మరింత ఆలస్యమైంది. ఈ సమస్యను ఇప్పటికే డీసీహెచ్ఎస్‌కు రాతపూర్వకంగా తెలిపాం. త్వరలోనే పోస్టుమార్టం సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం. – డాక్టర్ అరుణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవా

తిరుపతి తుడా : నగరంలో శనివారం నుంచి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులకు సూచించారు. ఆమె శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల నిర్వహణపై ఇంజినీరింగ్, హెల్త్, ప్లానింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు, వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఈ నెల 17వ తేదీ నుంచి సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా, అన్ని చోట్లా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించడంతోపాటు ఆరోగ్య సదస్సులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, డీఈలు విజయకుమార్‌రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, శ్రావణి, రాజు, రవీంద్రా రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉలవల పంపిణీ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, ఎర్రావారిపాళెం మండలంలోని బోడేవాండ్లపల్లె పంచాయతీల్లో శుక్రవారం రైతులకు సబ్సిడీ ఉలవలను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేశారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అందుకోవాలన్నారు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి



చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపం వద్ద అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. తదుపరి విశేషంగా అలంకరించి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరంలోని ప్రధాన కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనులు వేగంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలిసి పారిశుద్ధ్య, మురుగు కాలువల్లో చెత్త తొలగింపు పనులను కమిషనర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించే పనులు వేగవంతం చేసి రెండు మూడు రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు ప్రారంభమైతే కాలువల్లో ఎక్కడికక్కడ నీరు ఆగిపోయి రోడ్లపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. నగరంలో ఎక్కడ కూడా గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌లో చెత్త లేకుండా తొలగించాలని హెల్త్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపు పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఈ విజయ్ కుమార్ రెడ్డి, మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

టెక్నాలజీని మంచికి ఉపయోగించండి

తిరుపతి కల్చరల్: ప్రస్తుతం వస్తున్న ఆధునిక టెక్నాలజీని మంచికి ఉపయోగించుకుని అభివృద్ధి పథంలో పయనించాలని ఎస్వీయూ మాజీ వీసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రేవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) ప్రథమ జాతీయ మహాసభల నేపథ్యంలో రాయలసీమ విద్యాసంస్థల్లో శుక్రవారం నేటి టెక్నాలజీ –విద్యార్థుల భవిష్యత్తు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ పెరగడంతో మనిషిలో మార్పు వచ్చిందన్నారు. టెక్నాలజీతో విద్యార్థులు, యువత చెడిపోతున్నారని వాపోయారు. మానవ సంబంధాలు తెగిపోతున్నట్లు తెలిపారు. ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగిన తర్వాత చిన్న పిల్లలు మొబైల్ లేనిదే బతకలేము అన్నంతగా తయారవుతున్నారని, దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడడమేనన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తిరుపతి సిటీ: ఎస్వీయూ బోటనీ విభాగం, గ్రీన్ టీమ్ ఆధ్వర్యంలో ఆరోగ్య జీవన విధానం – ప్రకృతి కూరగాయల సాగు అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్ద్ సంస్థ కార్యదర్శి గంగాధరం మాట్లాడుతూ ఇంటి పెరటిలో 20 టు 20 విస్తీర్ణంలో సుమారు 15 రకాల కూరగాయల మొక్కలను నాటుకుని ఒక కుటుంబానికి అవసరమయ్యే కూరగాయలను పండించుకోవచ్చన్నారు. బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం ఎరువుల తయారీని వివరించారు. బోటనీ విభాగాధిపతి ప్రొఫెసర్ నాగలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్/చంద్రగిరి : విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు వల్ల శనివారం తిరుపతిలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీనగర్ కాలనీ, రాఘవేంద్రనగర్, రాజీవ్‌గాంధీకాలనీ, జీవకోన, శివజ్యోతినగర్, ఉపాధ్యాయనగర్, క్రాంతినగర్, భవానీనగర్, కొర్లగుంట, వినాయకనగర్, తుడా రోడ్డు, తిలక్‌రోడ్డు, రైల్వేకాలనీ, సుందరయ్య నగర్, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, వీవీమహల్‌రోడ్డు, టీకేస్ట్రీట్, కేకే లేఅవుట్, మధురానగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. చంద్రగిరి మండల వ్యాప్తంగా కూడా విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, సీఐటీయూ, విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ: ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సీతారాం ఏచూరి అని ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు కొనియాడారు. ఆయన శుక్రవారం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మనాభంతో కలిసి వర్సిటీలోని ప్రకాశం భవన్ ఎదుట సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని పేర్కొన్నారు. డీన్ మురళీధర్, సీఐటీయూ నేత జయచంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, అక్బర్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

పీడిత వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డ యోధుడిగా సీతారాం ఏచూరి చరిత్రలో నిలిచిపోతారని ఎస్వీయూ మాజీ వీసీ రాళ్లపల్లి రామమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1995లో ఎస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించిన సభలో సీతారాం ఏచూరి దేశప్రగతిలో ఉన్నత విద్య ప్రాధాన్యం, దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యంపై అద్భుతమైన ప్రసంగం చేశారని తెలిపారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు వెల్లడించారు.

పాకాలలో..

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో శుక్రవారం సీతారాం ఏచూరికి సీపీఎం, ఆటో యూనియన్, కేవీపీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం నాయకుడు మధుసూదన్‌రావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి కార్మికుల పక్షాన నిలిచి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు.

నులిపురుగుల నివారణ అందరి బాధ్యత

రామచంద్రాపురం: విద్యార్థుల్లో నులిపురుగుల నివారణ అందరి బాధ్యత అని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలో 7,700 మంది విద్యార్థులకు 17న ఆల్‌బెండాజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. ఎంఈవో మార్కొండయ్యనాయుడు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం



పాకాల : లయన్స్‌క్లబ్ సభ్యుడు గుండ్లపల్లి ఆంజనేయులు తన కుమార్తె భావన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్థానిక సచివాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్.కస్తూరి, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ తులసీరామన్, లయన్ కుప్పుస్వామినాయుడు, పి.భాస్కర్, రాజేంద్రుడు, ఏకాంబరం, నరసింహులు, ఆదికేశవులు, కృష్ణమూర్తి, గోపాలయ్య, జయబాల, ఏడీపీఎస్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డేకేర్ సెంటర్ ప్రారంభం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఉద్యోగులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం చిన్నపిల్లల డేకేర్ సెంటర్‌ను వీసీ వి ఉమ శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డేకేర్ సెంటర్‌లో పిల్లలకు సురక్షితమైన పోషణ, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ రజిని, డీన్లు సుజాతమ్మ, వాణి, బిందు, ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, ప్రొఫెసర్ గంగాభవాని, ఎం అరుణ, శిరీష పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట: వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కుష్టు, క్షయ నివారణ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. భాకరాపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం కుష్టుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలు, నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారి ఉండడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. డీఎస్ఎంవో రాజా, వైద్యాధికారి హేమంత్‌రెడ్డి, వెంకటరమణ, డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాల అప్పగింత

చంద్రగిరి: భాకరాపేట కనుమలో గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. మృతి చెందిన మునివెంకట రెడ్డి(55), మంజునాథ(38), డ్రైవరు రమేష్ మూర్తి(34) మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చి అనంతలోకాలకు వెళ్లిపోయారా అంటూ బోరున విలపించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన తేజేస్ కుమార్‌ను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం చిక్‌బళ్లాపూర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడు



బాలున్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: అదృశ్యమైన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 11వ తేదీ రాత్రి సెక్యూరిటీగా పని చేస్తున్న కైలాష్ కొడుకు బాలాజీ(18 నెలలు) మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి నాలుగు బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలించినట్లు తెలిపారు. కైలాష్ పూటుగా మద్యం సేవించి టీవీఎస్ షోరూం వద్ద నడుచుకుంటూ వెళ్లినట్లు గుర్తించామన్నారు. అప్పుడు బాలుడు ఉన్నాడని, తర్వాత అతను కింద పడిపోవడంతో బాలుడు ఎటో వెళ్లిపోయాడన్నారు. ఏడుస్తున్న బాలుడిని సమీపంలో పూలు విక్రయిస్తున్న వ్యాపారి అక్కున చేర్చుకున్నట్టు తెలిపారు. ఎవరికి అప్పగించాలో తెలియక ఆమె సొంత ఊరైన పుత్తూరు వద్ద పొట్టిగొట్లలో వినాయక నిమజ్జనానికి తీసుకెళ్లిందన్నారు. మరుసటి రోజు తిరిగి బైరాగిపట్టెడ వద్దకు వచ్చిందని, ఏఎస్ఐ రవి, కానిస్టేబుల్ మణికంఠ బాలున్ని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ





పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు, కంకణదారులైన చెవిరెడ్డి రఘునాథరెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీవారి మూలవిరాట్టు వద్ద ఆచార్య ఋత్విక్‌వరణం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి సర్వసైన్యాధిపతి విష్వక్సేనుడిని గ్రామంలో ఊరేగించి వినాయకుని ఆలయంలో మృత్సంగ్రహణం, ఆస్థానం చేపట్టారు. అనంతరం ప్రధాన ఆలయం వద్దకు చేరుకుని పవిత్ర మండపంలో అంకురార్పణకు సంబంధించిన వైదిక క్రతువులు చేపట్టారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, చెవిరెడ్డి మంజుల దంపతులు కంకణ ధారణ చేశారు. అంకురార్పణ తర్వాత శనివారం నుంచి మూడు రోజులు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఆలయంలో ఏడాది పొడవునా నిర్వహించే క్రతువుల్లో తెలిసీ తెలియక జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. శనివారం పవిత్ర ప్రతిష్ఠ, ఆదివారం పవిత్ర సమర్పణ, 16న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో నల్లందుల సుబ్బరామిరెడ్డి తెలిపారు.

గోవిందరాజస్వామి ఆలయంలో..



సేనాధిపతి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో శనివారం నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం ఆచార్య రుత్విక్‌వరణం సందర్భంగా రుత్వికులకు వస్త్ర సమర్పణ చేశారు. సాయంత్రం ఆలయ విమాన ప్రాకారం చుట్టూ సేనాధిపతిని ఊరేగించారు. యాగశాలలో అంకురార్పణ చేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజులు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం మాజీ మంత్రి కిల్లి కృపారాణి, సినీ నిర్మాత అశ్విని దత్, మాజీ మంత్రి డీకే అరుణ, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం, తెలంగాణ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ప్రభాకర్, పాయల్ శంకర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

बुलडाणा अर्बन | Buldana Urban

Area of Operation:- Maharashtra, Madhya Pradesh, Chhattisgarh, Gujarat, Rajasthan, Andhra Pradesh, Goa, Andaman & Nikobar

* NOTICE OF THE ANNUAL GENERAL MEETING *
(Only for members)
Sunday 29 September 2024

Outward No. 1080/24-25 Date : 14th Sep. 2024

All Hon. Members

The Annual General Meeting of Buldana Urban Co-Op. Credit Society Ltd. Buldana R.No. 267 Will be held on **Sunday 29th September 2024 at 4.00 p.m.** at Sahakar Vidya Mandir, Vidya Nagari, Chikhali Road, Buldana All Society Members are requested to attend the A.G.M. Meeting.

By Order of Board of Directors

Dr. Sukesh Zamwar
Chief Managing Director

* Subject to be transacted *

1) To read and confirm the minutes of previous AGM held on 24th September 2023.
2) To confirm and accept the Balance Sheet, Profit & Loss and Receipt & Payment for the year ended on 31.03.2024.
3) To consider the Budget for the year 2024-2025 as per the recommendation of Board of Directors' meeting Dt.13.05.2024 (Vide resolution No. 19).
4) To sanction excess expenses over the Budget for the year 2023-2024 as per the recommendation of Board of Directors' meeting Dt. 13.05.2024 (Vide resolution No. 20)
5) To confirm and accept the profit appropriation as per the recommendation of Board of Directors' meeting Dt. 13.05.2024 (Vide resolution No. 21)
6) To approve statutory Auditor's Report for the year 2023- 2024 and confirm Audit Compliance Report for the year 2022-2023.
7) To sanction and fix the credit exposure limit for outside borrowing by the Society for the year 2024-25.
8) To produce detailed information of the outstanding loan to Directors and their relatives as on 31-03-2024.
9) To appoint Statutory Auditor for year 2024-2025 as per the Multi State Co-Op. Societies Act., 2002 and to decide upon their remuneration.
10) To declare list of employees who are the relatives of members of Board of Directors.
11) To amend the Bye Law of the Society No. 15 Authorised Share Capital.
12) To Confirm and accept accounts & audit report of subsidiary company of the Society for the year 2023-24.
13) Discussion About Opening New Branches To Increase Business Of Society
14) To Provide the list of the members whose membership has been cancelled in the financial year 2023-2024.
15) To Discuss about making Investement in Solar Engery Project and Incorporation of independent subsidiary company for such Solar Engery Project.
16) Discussion on queries from members received 3 days prior to the AGM
17) To consider any other matter with the permission of Hon. Chairperson

Note : 1) If the Quorum is not fulfilled then the meeting will be adjourned for half on hour and such adjourned meeting will then be held at the same date at the same place which will not require the quorum. 2) Meeting will be followed by dinner. 3) Members are requested to give a 3 days' notice to the Head office in case they require any information from the society 4) Membership will be dissolved if a member remains absent for AGM Consecutively for 3 yrs. as per Section 29 of Multi-State Co-op. Soc. Act. 2002